## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన జిల్లా నేతలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో షీప్స్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్లు బాలరాజు, రవికుమార్

**గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఆయన తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి, పలువురు నాయకులు మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గుత్తాతోపాటు పలువురు నాయకులు కలిశారు.**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మొక్క అందజేస్తున్న ఆ పార్టీ నాయకురాలు పాల్వాయి స్రవంతి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, పార్టీ నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డి

# మిగ్‌జాం ఎఫెక్ట్

మిగ్‌జాం తుఫాన్ ఎఫెక్ట్ ఉమ్మడి నల్లగొండ జిల్లాను తాకింది. తుఫాన్ ప్రభావంతో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ముసురు అలుముకున్నది. వర్షంతో వీధులన్నీ బురదమయంగా మారాయి. చలితీవ్రత పెరుగడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సిన వారు గొడుగులు, స్వెటర్లు ధరించి వెళ్లారు. వర్షంతో వ్యవసాయ పనులకు స్వల్ప ఆటంకం కలిగింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పారు. సూర్యాపేట జిల్లాకు ఆరెంజ్, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాలకు అధికారులు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. తుఫాన్ ఎఫెక్ట్ మరో రెండ్రోజులపాటు కొనసాగే అవకాశం ఉంది.

సూర్యాపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

నందికొండలో కురుస్తున్న వర్షం

నల్లగొండ పట్టణంలోని శివాజీ నగర్‌లో..

మిర్యాలగూడ పట్టణంలో..

నల్లగొండలో గొడుగు సాయంతో వెళ్తున్న మహిళ

మఠంపల్లిలో కురుస్తున్న వర్షం

ఆత్మకూరు(ఎం)లో..

## యాదగిరిగుట్టలో జోడు సేవోత్సవం

మొదటి ప్రాకార మండపంలో జోడు సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 5 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు వెండి మొక్కు జోడు సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. మంగళవారం సాయంత్రం ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించారు. స్వామివారిని గరుఢ వాహన సేవ, అమ్మవారిని తిరుచ్చీ వాహన సేవపై వేంచేపు చేశారు. వర్షాభావంతో జోడు సేవను మొదటి ప్రాకార మండపంలో ఊరేగించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సుదర్శన నారసింహ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి గజ వాహన సేవ నిర్వహించారు. వెలుపలి ప్రాకార మండపంలో తూర్పునకు అభీష్టంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్తీకమాసం సందర్భంగా వ్రత పూజలు, దీపారాధనలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చన చేపట్టారు. స్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలుఉ అందజేశారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకుని ఆలయ ఖజానాకు రూ.26,82,274 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ గీత, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి తెలిపారు.

## పోటాపోటీగా కరాటే కుస్తీలు

నల్లగొండలో కరాటే పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్

**● నల్లగొండలో రాష్ట్ర స్థాయి బాలబాలికల కరాటే పోటీలు ప్రారంభం**

నల్లగొండ రూరల్, డిసెంబర్ 5 : క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందుతుందని, యువత క్రీడలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం రాష్ట్ర స్థాయి అండర్-14, 17 బాలబాలికల కరాటే పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతోపాటు ఆటల్లోనూ ప్రోత్సహించాలని సూచించారు. కరాటేతో వ్యక్తిగత ధైర్యంతోపాటు శారీరక దృఢత్వం అభివృద్ధి చెందుతుందన్నారు. బాలబాలికలు క్రీడా పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ భిక్షపతి, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ వాసుదేవరావు, జిల్లా కరాటే అసోసియేషన్ కార్యదర్శి దాసోజు నరసింహాచార్యులు, ఉపాధ్యాయులు రవీందర్, విమల, నాగరాజు, ధర్మేం దర్‌రెడ్డి, గఫార్, కవిత, శ్రీనివాస్‌రావు, యాదయ్య, షరీఫ్, కరాటే కోచ్‌లు పాల్గొన్నారు.

## జాతీయ సెమినార్‌కు ఆహ్వానం

రామగిరి, డిసెంబర్ 5 : నల్లగొండ పట్టణ శివారులోని చర్లపల్లిలో గల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 'కాంటెంపరరీ ఇష్యూస్ ఇన్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు కళాశాల కామర్స్ విభాగం హెచ్ఓడీ, సెమినార్ కన్వీనర్ అపర్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌లో పాల్గొనే అధ్యాపకులు, విద్యార్థులు, ఇతరులు జనవరి 13, 2024లోగా rdcwnlgns2024 @gmail.com అబ్‌స్టాక్ పంపించాలని కోరారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహకారంతో ఫిబ్రవరి 16, 17, 2024లో కళాశాలలో సెమినార్ నిర్వహణ ఉంటుందని వెల్లడించారు. అదేవిధంగా సెమినార్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకునే వారు https://forms.gle/rTpNy3PLqjjDDRfYAలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సెమినార్‌లో ఉత్తమ పేపర్ అందచేసిన వారి టాపిక్స్‌ను ఐఎస్‌బీఎన్, ఐఎన్ఎస్ఎన్ గుర్తింపు ఉన్న పబ్లికేషన్‌లో ప్రచురించనున్నట్లు తెలిపారు.